ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

ఇదెక్కడి నియామకం

- ఆలేరు మార్కెట్‌లో మోత్కూరు కమిటీ పరిధి వ్యక్తికి పదవి
- నిబంధనలకు విరుద్ధంగా నియామకం
- వైస్ చైర్మన్ పదవిని పక్కనబెడుతూ హైకోర్టు నిర్ణయం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 26 : 'ఇదెక్కడి నియామకం.. మోత్కూరు మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న వ్యక్తికి ఆలేరు మార్కెట్ కమిటీలో పదవిని ఎలా కట్టబెడతారు.? మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవి ముమ్మాటికి నిబంధనలకు విరుద్ధమే.. పదవిని పక్కన పెట్టాల'ంటూ హైకోర్టు ఈ నెల 18వ తేదీన తీర్పు నివ్వగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవిని ఆ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని గ్రామాలకు చెందిన వ్యక్తులు మాత్రమే అర్హులు. కానీ మోత్కూరు మార్కెట్ కమిటీ పరిధిలోని కాటేపల్లి గ్రామానికి చెందిన పచ్చిమట్ల మధార్ గౌడ్‌ను ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా 2024 ఆగస్టు 31వ తేదీన నియమించారు. ఈ ఎన్నిక నిబంధనలకు విరుద్ధమని తుర్కపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్, గంధమల్ల మాజీ సర్పంచ్ శాగర్ల పరమేశ్ హైకోర్టును ఆశ్రయించారు. జీఓ నంబర్-43 ప్రకారం నూతనంగా ఏర్పాటైన మోటకొండూర్ మండలానికి నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీని ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉన్నా.. అది ప్రాథమిక దశలోనే ఉంది. కాటేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పచ్చిమట్ల మధార్‌గౌడ్‌ను నియమించారని ఆధారాలతో సహా హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్లు వేసిన రికార్డులు, అందుబాటులో ఉన్న విషయాలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవిదేవి పరిశీలించారు. ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీని కౌంటర్ దాఖలు చేయాలని సూచించారు. వైస్ చైర్మన్‌గా ఎన్నికైన పచ్చిమట్ల మాధార్‌గౌడ్ ఆలేరు పరిధిలోకి రాడని, నియామకాన్ని సవాల్ చేయడం లేదని అంగీకరించారు. ఈ క్రమంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి ఆయన అనర్హుడని, ఆయన పదవిని పక్కన పెడుతూ తీర్పును వెలువరించారు.

అనాలోచిత నిర్ణయం..

ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నియామకం అనాలోచిత నిర్ణయమేనని ఆ పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గుసగుసలాడుకుంటున్నారు. ఒక మార్కెట్ పరిధిలోని వ్యక్తిని మరో మార్కెట్ కమిటీలో పదవిని కట్టబెట్టడం ఎలా సాధ్యపడుతుందో తెలియని పరిస్థితిలో అధికార ప్రజాప్రతినిధులు ఉన్నారని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 25 : జిల్లా పరిధిలో వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. మండల పరిధిలోని రాయిగిరిలోని విద్యా జ్యోతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బుధవారం పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని తీసుకొని, వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఈ ప్రక్రియను కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, జిల్లాలో మండలానికి ఒక పోలింగ్ కేంద్రం ఉండగా మొత్తం 17 పోలింగ్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాలో మొత్తం 984 ఓటర్లు ఉన్నారని, ఇందుకు 17 మంది పీఓఎస్, 17 మంది ఏపీఓఎస్, 17 మంది ఓపీఓఎస్, 34 మంది మైక్రో అబ్జర్వర్లును నియమించినట్టు పేర్కొన్నారు. ప్రతి మూడు పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ ఆఫీసర్ చొప్పున మొత్తం 6గురిని నియమించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమేరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. పోలీసు సిబ్బంది తరలింపునకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, పోలింగ్ సామగ్రి తరలింపులో సమస్యలు తలెత్తితే అధికారులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో మొత్తం 17 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. సమావేశంలో భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి అధికారులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : రాయిగిరిలోని విద్యా జ్యోతి హైస్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్ : అదే విధంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు.

గుండాల : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 12 మంది పురుషులు, 6 మంది మహిళా ఓటర్లుండగా మొత్తం 18 మంది ఉపాధ్యాయులు ఓటు వేయనున్నారు.

ఉపాధ్యాయులు ఏదేని ప్రభుత్వ గుర్తింపు పొందిన ఐడీ కార్డు తీసుకుని రావాలని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఎండీ.అజీజొద్దీన్ సూచించారు.

ఆత్మకూరు(ఎం) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి బుధవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధిత అధికారులు సిబ్బంది చేరుకున్నారు. మండలంలో మొత్తం 46మంది ఓటర్లుండగా ఇందులో పురుషులు 27, మహిళలు 19మంది ఉన్నట్లు తాసీల్దార్ రవికుమార్ తెలిపారు.

భూదాన్‌పోచంపలి : మండలంలో 48 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకొనున్నారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు తెలిపారు.

చౌటుప్పల్ : మండల వ్యాప్తంగా 106 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

మోత్కూరు : మండలంలో మొత్తం 70 మంది ఉపాధ్యాయులు ఓటు వేయనున్నట్లు తాసీల్దార్ డి. రాంప్రసాద్ తెలిపారు.

రామన్నపేట : మండల కేంద్రంలో మొత్తం 59 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎన్నికల ఇన్‌చార్జి బాలకిష్టయ్య తెలిపారు.

గుండాల : మండల కేంద్రంలో ఎన్నికల సామగ్రితో చేరుకున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి

చౌటుప్పల్‌లో పోలింగ్ కేంద్రానికి చేరిన సామగ్రి

కూరెళ్లలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రైతువిభాగం మండలాధ్యక్షుడు నర్సిరెడ్డి

ఎండిన పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలి : బీఆర్ఎస్

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 26 : సాగునీరు లేక ఎండిపోయిన వరి పంటలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందివ్వాలని, పంటలు నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని బీఆర్ఎస్ రైతు విభాగం మండలాధ్యక్షుడు పుట్ట నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కూరెళ్లలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు ఎండిపోవడంతో పాటు వ్యవసాయబావులు, బోర్లల్లో నీళ్లు అడుగంటి పోయాయన్నారు. దీంతో ప్రతి గ్రామంలో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు కూడా పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ చేయకుండా, రైతుభరోసా అందివ్వకుండా మోసం చేసిందన్నారు.

సమావేశంలో మాజీ సర్పంచ్ భాషబోయిన ఉప్పలయ్య, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎరుకల స్వామిగౌడ్, గడ్డం అశోక్, మండల నాయకులు కూరెళ్ల రమేశ్, శంకర్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 26 : మండలంలోని టంగుటూరు శివారులోని కాల్వ పక్కన బానోతు వెంకన్న (24) చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు గుర్తించామని ఎస్ఐ రజనీకర్ బుధవారం తెలిపారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్యాలమ్మతండాకు చెందిన వెంకన్న ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చేనేత కార్మికుడు మృతి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 26 : మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు గుర్రం లింగస్వామి బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థికసాయం చేశారు. సీపీఎం గ్రామశాఖ అధ్వర్యంలో రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, సీపీఎం నాయకులు మేడి రామలక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, స్వామి పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు

వలిగొండ, ఫిబ్రవరి 26 : మండలంలో మైనర్ బాలికను వేధించిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. హైదారాబాద్‌కు చెందిన తాళ్ల సంతోశ్ అనే వ్యక్తి మండలంలోని అరూరు గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను వేధించాడని బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీసీ కెమేరాల ద్వారా నిందితుడిని గుర్తించిన పోలీసులు అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

ఇసుక లారీలు పట్టివేత

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 26 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను బుధవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రా రాష్ట్రం బాపట్లలోని చిన్న గంజాం నుంచి యాదాద్రి జిల్లా జలాల్‌పూర్ గ్రామ శివారు నారాయణగిరికి అక్రమంగా తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కొత్తపల్లి శీను, బత్తుల రాజుపై కేసు నమోదు చేసి లారీలు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు మృతి

కోదాడ టౌన్, ఫిబ్రవరి 26: కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పడిశాల రఘు మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని, ఖమ్మం తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గం మధ్యలో గుండెపోటుతో మృతిచెందారు. రఘు భౌతికకాయానికి సూర్యాపేట డీఎస్పీ రవి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కారింగుల అంజన్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నహీం, శ్రవణ్, జర్నలిస్టు సంఘం నాయకులు నివాళులర్పించారు.

ఎల్ ఈడీ బల్బులు వితరణ

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 26: మండల పరిధి శ్రీనివాసపురం గ్రామంలో వీధి లైట్లు లేక రాత్రిపూట అంధకారం నెలకొంటుండడంతో గ్రామానికి చెందిన బాణోతు చంటినాయక్ స్పందించి బుధవారం 30 ఎల్ఈడీ బల్బులు వితరణ చేశారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆలయానికి..

పెన్‌పహాడ్:నాగులపహాడ్ శివాలయానికి గ్రామానికి చెందిన ఎలుక సైదులు, మమత దంపతులు బుధవారం రూ.10 వేల విలువైన ఎల్ఈడీ లైట్లను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పొగుల జానయ్యగౌడ్, గౌరవాధ్యక్షుడు జానకిరాములు, నిరంజన్‌రెడ్డి, అంజయ్య, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు

- జలాల్‌పూర్ చెరువుకట్ట మూలమలుపు రక్షణ గోడకు కలుగని మోక్షం
- మూడుసార్లు టెండర్లు పిలిచినా ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు

జలాల్‌పూర్ చెరువు కట్ట మూలమలుపు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 26 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామం చెరువు కట్ట మూలమలుపు వద్ద రక్షణ చర్యలు చేపట్టేందుకు నిధులు మంజూరైనా పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు మూడుసార్లు టెండర్లు వేసి పిలిచినా ఏ ఒక్కరూ స్పందించడం లేదు. గతేడాది డిసెంబర్ 7న జలాల్‌పూర్ చెరువు కట్ట మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లడంతో ఎల్బీనగర్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు మృతి చెందారు. వారం తరువాత మరో కారు కూడా చెరువులోకి దూసుకెళ్లింది. ఈ మూలమలుపు వద్ద వరుసగా ప్రమాదాలు సంభవిస్తుండడంతో రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు పలుమార్లు ధర్నాలు, ఆందోళనలు చేశారు. జనవరిలో రాచకొండ పోలీసులు తాత్కాలికంగా బారికేట్లను ఏర్పాటు చేశారు. ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించి, కట్ట మూలమలుపు వద్ద ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన రక్షణ చర్యల కోసం ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.20 లక్షలు నిధులను మంజూరు చేయించారు. వెంటనే పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. మంజూరైన రూ.20 లక్షలతో చెరువు కట్టకు ఇరువైపులా 400 మీటర్ల మెటల్ బారికేడ్లు, మెయిన్ రోడ్డుపై రంబుల్ స్ట్రిప్స్, రోడ్ స్టంట్స్, కాషన్ బోర్డులు, బ్లింకింగ్ లైట్స్ ఏర్పాటు చేయడానికి అధికారులు టెండర్లను పిలిచారు. మూడు సార్లు టెండర్లను పిలిచినా పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గతంలో చేసిన పనులకే ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో బిల్లులు వస్తాయో, రావో అనే అనుమానంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిసింది.

కాంట్రాక్టర్లు రావడం లేదు

జలాల్‌పూర్ చెరువు కట్ట వద్ద రక్షణ చర్యల కోసం ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. మూడుసార్లు టెండర్లను పిలిచాం. కానీ కాంట్రాక్టర్లు ఎవరూ కూడా పనులు చేపట్టడానికి ముందుకు రావడం లేదు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– లింగయ్య, ఆర్అండ్‌బీ ఏఈ

వడపర్తి వాగు చెరువును పరిశీలిస్తున్న ఎండీ.జహంగీర్

బస్వాపురం ప్రాజెక్టుకు రూ.300 కోట్లు కేటాయించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : బస్వాపురం రిజర్వాయర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.300 కోట్లు కేటాయించి పూర్తి చేయాలని, ముంపునకు గురైన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని వడపర్తి వాగు చెరువును, కులతండా దగ్గర నిర్మాణమవుతున్న కాల్వను బుధవారం ఆయన రైతులతో పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో సాగు, తాగునీటికి కీలకంగా ఉపయోగపడే బస్వాపురం రిజర్వాయర్‌కు రూ.300 కోట్లు కేటాయిస్తే నష్టపరిహారం చెల్లించడానికి, ప్రాజెక్టు పూర్తికి అవకాశం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, నీటిపారుదల శాఖ మంత్రి బాధ్యత తీసుకొని వచ్చే బడ్జెట్ సమావేశాల్లో నిధులు విడుదల చేయాలని కోరారు. వడపర్తి కత్వాను, భువనగిరి, బీబీనగర్ చెరువులను నింపడం వల్ల పదుల సంఖ్యలో గ్రామాల్లోని చెరువులు నిండుతాయని, వందలాది ఎకరాల భూములు సాగులోకి వస్తాయన్నారు. ప్రాజెక్టు పూర్తి, కాల్వల నిర్మాణం కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, మండల కమిటీ సభ్యుడు పాండాల మైసయ్య, శాఖ కార్యదర్శి పాండాల ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

మైనింగ్ తవ్వకాల అడ్డగింత

తిరుమలగిరి, ఫిబ్రవరి 26: మండలంలోని తొండ గ్రామంలో చేపడుతున్న మైనింగ్ తవ్వకాలను బుధవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. తొండ గ్రామంలోని పోరెల్ల గుట్టలో మైనింగ్ తవ్వకాల కోసం ఓ కంపెనీ 2018వ సంవత్సరంలో దరఖాస్తు చేసుకోగా 2023లో గ్రామసభ తీర్మానం లేకుండానే ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే, అప్పటి నుంచి గ్రామస్తులు గ్రామ సభ తీర్మానం లేకుండా అనుమతులు ఎలా ఇస్తారని మైనింగ్ తవ్వకాలు జరుపకుండా అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలకు నచ్చజెప్పి పనులను నిలిపి వేశారు. కార్యక్రమంలో నీరటి ప్రవీణ్, రమేశ్, చంద్రయ్య, నవీన్, వెంకన్న, అంజయ్య, యాదగిరి, గొడుగు సోమయ్య, సోమనర్సయ్య పాల్గొన్నారు.

తొండ గ్రామంలో మైనింగ్ తవ్వకాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు : సీపీఎం

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 26: కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు తప్పడం లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని చిన గ్యారకుంట తండాలో ఎండిపోయిన వరి పొలాలను సీపీఎం నాయకులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ.. నీటిపారుదలశాఖ అధికారుల తప్పుడు సమాచారం వల్ల పెన్‌పహాడ్ మండలంలో శ్రీరామ్ సాగర్ ఆయకట్టు పరిధిలో వేలాది ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోయాయని ఆరోపించారు.

వివాహిత అదృశ్యం

అంజలి

చౌటుప్పల్, ఫిబ్రవరి 26 : పట్టణ కేంద్రంలో బుధవారం ఓ వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన దేశగోని మల్లేశ్ యాదవ్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ కుటుంబంతో కలిసి చౌటుప్పల్ పట్టణంలోని హెచ్ఎండీఏ వెంచర్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 25న వ్యక్తిగత పని నిమిత్తం మల్లేశ్ యాదవ్ నల్లగొండకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆయన భార్య అలివేలు అలియాస్ అంజలికి అదే రోజు ఆయన ఫోన్ చేయగా కుమారుడు అర్జున్ ఫోన్ ఎత్తి.. తల్లి లింగోజిగూడెంలోని అమ్మమ్మ ఇంట్లో తనను దింపి బ్యాంక్‌కు వెళ్లి వస్తానని చెప్పిందని సమాధానం ఇచ్చాడు. ఆ రోజు నుంచి ఆమె తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇంట్లో వెతికినా ఆచూకీ తెలియకోవడంతో బుధవారం మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

ఖైతాపురంలో మరో మహిళ..



లావణ్య

చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రా మంలో మరో మహిళ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెంది న గోపనబోయిన లింగస్వామి-లావణ్య దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. మంగళవారం రాత్రి వీరంతా ఇంట్లో భోజనం చేసి నిద్రించారు. తెల్లవారుజామున 3 గంటలకు లింగస్వామి లేచి చూడగా భార్య కనిపించలేదు. చుట్టు పక్కల, బంధువుల ఇంట్లో వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపాడు.

బైక్ తగులబెట్టిన వ్యక్తి

రాజాపేట, ఫిబ్రవరి 26 : మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో బుధవారం ఓ వ్యక్తి తన ఎక్సెల్ బైక్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టాడు. మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన ఎన్నబోయిన గణేశ్ తాగిన మైకంలో బైక్‌ను దగ్ధం చేసినట్లు తెలిసింది.

వైభవంగా మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం

ఆలేరు రూరల్ : కొలనుపాక సోమేశ్వరాలయంలో బారులు దీరిన భక్తులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 26 : మహాశివరాత్రి సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి నిత్య పారాయణాల అనంతరం స్వామివారికి మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశికర ధర్మకర్త బి. నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి భాస్కర్‌రావు, ఉప కార్యనిర్వహణాధికారి దోర్బాల భాస్కర్‌శర్మ పాల్గొన్నారు.

ఘనంగా మహా శివరాత్రి

ఆత్మకూరు(ఎం) మండలంలోని కూరెళ్ల త్రికుటాలయంలో శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్‌రెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలత పూజలు చేశారు. ఆలేరు మండలంలోని కొలనుపాక సోమేశ్వరాలయం, కుషంగల మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలేరు మండలంలోని కొడవటూర్ గ్రామంలో గల సిద్ధేశ్వర స్వామి ఆలయంలో జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పూజలు చేశారు. ఆయనకు మున్సిపల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య ఆహ్వానం పలికారు. భువనగిరి పట్టణంలోని పచ్చల కట్ట సోమేశ్వరాలయంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అభిషేకం చేశారు.

ఆలేరు : సిద్ధేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ శంకరయ్య

మోత్కూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రామన్నపేట, ఫిబ్రవరి 26 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వేములకొండలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కొలగాని వెంకటేశ్(58) మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పని నిమిత్తం మంగళవారం మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి మధ్యాహ్నం 2 గంటల సమయంలో వెళ్లాడు. రాత్రి 9 గంటలైనా ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా వస్తున్నానని చెప్పాడు. కానీ రాత్రి మొత్తం ఇంటికి రాలేదు. బుధవారం ఉదయం లక్ష్మాపురం గ్రామానికి చెందిన జోగుల నర్సింహ వాకింగ్‌కు వెళ్లగా మూసీ నది బ్రిడ్జి కింద వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంకటేశ్ కుమారుడు కొలగాని మహేశ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందనది తనే తండ్రేనని గుర్తించి, మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ మల్లయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దశరథరెడ్డి

దశరథరెడ్డిని సన్మానిస్తున్న నేతాజీ యువజన మండలి సభ్యులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 26 : మండల కేంద్రానికి చెందిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు కందడి దశరథరెడ్డి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇటీవల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా దశరథరెడ్డిని నేతాజీ యువజన మండలి మాజీ అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్‌గౌడ్, పోతగాని మల్లేశం గౌడ్, దొంతరబొయిన భాస్కర్ బుధవారం సన్మానించి అభినందనలు తెలిపారు.

'అన్నదానం మహాదానం'

కోదాడ రూరల్, ఫిబ్రవరి 26: అన్నదానం మహాదానమని బీఆర్ఎస్ మండల నాయకుడు దొంతగాని అప్పారావు అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని కాపుగల్లు వీరన్నస్వామి దేవాలయంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు అప్పారావు